# సాక్షి
## తూర్పుగోదావరి

బుధవారం । 11 । అక్టోబర్ । 2023




### భవన నిర్మాణానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వెంకన్న ఆలయంలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి అడపా గోవిందరాజు, తులసి దంపతులు (రావులపాలెం) మంగళవారం రూ.లక్ష విరాళం సమర్పించారు.

### అన్నదానానికి విరాళం



అన్నవరం: సత్య దేవుని నిత్యాన్నదాన పథకానికి అది మూలం సాంబశివ రావు, కమల దంపతులు మంగళవారం రూ.1,00,001 విరాళం సమర్పించారు.

### కడలిలోకి 64 వేల క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం 64,199 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. డెల్టా కాలువలకు 14,100 క్యూసెక్కులు వదిలారు. ఇందులో తూర్పు డెల్టాకు 4,800, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 7 వేల క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 10.70, భద్రాచలం వద్ద 13.90 అడుగులుగా నీటిమట్టం నమోదైంది.

## న్యూస్‌రీల్

### నాడు బొక్కేసి ఇప్పుడు బుకాయింపులా?

**లోకేష్‌పై ఎంపీ భరత్‌రామ్ మండిపాటు**



రాజమహేంద్రవరం రూరల్: టీడీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి బాగోతాలు చాలా జరిగాయని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ ఆరోపించారు. రాజమహేంద్రవరంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బొక్కినంత బొక్కి ఇప్పుడు కాదంటే ఎలా అని లోకేష్ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో ఎంత తిన్నారో, ఎలా కక్కించాలో సీఐడీ చూసుకుంటుందన్నారు. మొదట రూ.3వేల కోట్లు, ఆ తరువాత రూ.370కోట్లు, ఇప్పుడు రూ.27 కోట్లు అంటున్నారని లోకేష్ వ్యాఖ్యానించంపై ఎంపీ స్పందించారు. స్కాం జరిగింది. చంద్రబాబు జైలులో ఉన్నాడు..మరి నువ్వెందుకు భయపడి ఢిల్లీ పారిపోయావని భరత్ ప్రశ్నించారు. గతంలో జరిగిన స్కాంలన్నింటికీ చంద్రబాబు, లోకేష్ సమాధానాలు చెప్పాల్సి వస్తుందన్నారు. స్కిల్ స్కాంలో రూ.270 కోట్లు డిజైన్ టెక్‌కు పంపి అక్కడ నుంచి హవాలా పద్ధతిలో చంద్రబాబు ఇంటికి సూట్ కేసులతో డబ్బులు చేరాయనేది స్పష్టమన్నారు. ఎప్పటినుంచో ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందని చెబుతూనే ఉన్నామన్నారు. అమరావతిలో ఎస్సీల అసైన్డ్ భూములను కారు చౌకగా లాక్కున్నారన్నారు. ఇవన్నీ బడాబాబుల చేతుల్లోకి వెళ్ళాయన్నారు. ఎన్ని పిల్లి మొగ్గలు వేసినా చంద్రబాబు, లోకేష్‌లను ప్రజలు నమ్మే పరిస్థితుల్లోలేరని ఎంపీ భరత్ స్పష్టం చేశారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాస్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

### రేపు కాపవరంలో జిల్లా స్థాయి గృహ వేడుక

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద జిల్లాలో 20,180 ఇళ్ల నిర్మాణం పూర్తి చేసినట్లు రాష్ట్ర హౌసింగ్ చీఫ్ ఇంజినీర్ జీవీ ప్రసాద్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం హౌసింగ్‌పై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో తొలి దశలో లక్ష్యాలను 99.5 శాతం మేర పూర్తి చేశారన్నారు. రెండో దశలో జిల్లాకు 19,403 ఇళ్లను కేటాయించామన్నారు. స్టేజ్ కన్వర్షన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈనెల 12న కాపవరంలో జరిగే జిల్లా స్థాయి గృహ ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. కాకినాడ జిల్లా సామర్లకోటలో జరిగే రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొంటారన్నారు. జిల్లా స్థాయిలో కొవ్వూరు మండలం కాపవరంలో జరుగుతుందన్నారు. ఇప్పటికే పూర్తి చేసిన గృహాలకు తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలకు సంబంధించి పనులన్నీ పూర్తి చేయాలన్నారు.

### నేడు జగనన్నకు చెబుతాం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జగనన్నకు చెబుతాం (జేకేసీ) తాళ్లపూడి మండల స్థాయి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ మాధవీలత తెలిపారు. బల్లిపాడులోని కాకర్ల రామయ్య, సుబ్బాయమ్మ కల్యాణం మంటపంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జిల్లా అధికారులు అర్జీలు స్వీకరిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి హోం మంత్రి తానేటి వనిత హాజరవుతారని, మండల ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయాలన్నారు.

# ముంగిటకే పరిష్కారం..!

- మండల కేంద్రాల్లో 'జగనన్నకు చెబుదాం'
- సత్ఫలితాలిస్తున్న ప్రతిష్టాత్మక కార్యక్రమం
- ఎక్కడి సమస్యలకు అక్కడే పరిష్కారం
- ఇప్పటికే 5 మండలాల్లో నిర్వహణ
- వ్యయ, ప్రయాసలు లేకుండా తీరుతున్న కష్టాలు



దేవపల్లిలో జగనన్నకు చెబుదాంలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ కె.మాధవీలత, ఎమ్మెల్యే తలారి వెంకట్రావ్



అర్జీలు ఇచ్చేందుకు వచ్చిన ప్రజలు

కాతేరుకు చెందిన వెంకటలక్ష్మి ఖాతాల్లో అమ్మ ఒడి జమ కాలేదు. ఏడో తరగతి చదువుతున్న కుమారుడు రాజేష్‌ను వెంటబెట్టుకుని 'జగనన్నకు చెబుదాం(స్పందన)కార్యక్రమానికి వచ్చింది. కలెక్టరుకు తన సమస్యను వివరించింది. కలెక్టర్ వెంటనే సంబంధిత సచివాలయ సిబ్బందితో ఫోన్‌లో మాట్లాడారు. సాంకేతిక సమస్య ఉందని బదులిచ్చారు. రెండుమూడు రోజుల్లో పరిష్కరించి ఖాతాలో పడేలా చూడాలని ఆదేశించారు. ఆమె ఆదేశించినట్టుగానే ఇంటికొచ్చిన రెండు మూడు రోజులకే ఖాతాలో అమ్మఒడి సొమ్ము జమ కావడంతో వెంకటలక్ష్మి ఆనందానికి అవధులు లేవు.





సాక్షి, రాజమహేంద్రవరం: ప్రజా సమస్యలు ఎక్కడికక్కడే పరిష్కరించడమే ధ్యేయంగా 'జగనన్నకు చెబుదాం' పేరుతో చేపట్టిన అర్జీల స్వీకరణ కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. ప్రజలు తమ మండలంలోనే బాధలు చెప్పుకుని, పరిష్కరించుకునే అవకాశం ప్రభుత్వం కల్పిస్తోంది. నిర్దేశించిన తేదీల్లో ఒక్కో మండలంలో ఒక్కో రోజు(బుధవారం, శుక్రవారం) ఫిర్యాదుల పరిష్కార వేదిక ఏర్పాటు చేస్తుండటం, నేరుగా జిల్లా స్థాయి అధికారులే వచ్చి అర్జీలు తీసుకుని సమస్యకు పరిష్కారం చూపుతుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆ మండలానికి చెందిన వారు మాత్రమే అక్కడి రావాల్సి ఉండటంతో ప్రతి సమస్య క్షేత్ర స్థాయిలో పరిష్కారానికి మార్గం సుగమం అవుతోంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు నిర్వహించిన కార్యక్రమంలో వందలాది అవస్థలకు శాశ్వత పరిష్కారం లభించింది.

**గత నెల 8న ప్రారంభం:**
రాష్ట్ర ప్రభుత్వం గత నెల 8వ తేదీ నుంచి ప్రతిష్టాత్మకమైన జగనన్నకు చెబుదాం మండల స్థాయి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లా వ్యాప్తంగా 19 మండలాల్లో నిర్వహించేందుకు నిర్దేశించిన తేదీల షెడ్యూల్ రూపొందించారు. తొలుత గోపాలపురం మండలంలో ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 13న కొవ్వూరులో నిర్వహించారు. 20న అనపర్తి, 29 రాజమహేంద్రవరం రూరల్, ఈనెల 6న దేవపల్లిలో ఫిర్యాదుల స్వీకరణ విజయవంతంగా జరిగింది. జిల్లా కలెక్టర్, అధికార యంత్రాంగం, ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు హాజరవుతున్నారు. ప్రజల అర్జీలు స్వయంగా తీసుకుని పరిష్కారం చూపుతున్నారు. కొన్నేళ్లుగా పరిష్కారం కాని సమస్యలు సైతం అక్కడికక్కడే తీరుతున్నాయి.

**అర్జీలు పరిష్కారం మచ్చుకు కొన్ని..**

| మండలం | అర్జీలు | పరిష్కారం | పురోగతిలో |
|---|---|---|---|
| గోపాలపురం | 128 | 117 | 11 |
| అనపర్తి | 123 | 75 | 48 |
| దేవరపల్లి | 88 | 3 | 85 |
| రాజమండ్రి అర్బన్ | 38 | 20 | 18 |
| కొవ్వూరు | 37 | 26 | 9 |
| కొవ్వూరు(అర్బన్) | 26 | 24 | 2 |

**ఎక్కడి సమస్యలు అక్కడే**
తమ స్వగ్రామాలకు సమీపంలోని మండల కేంద్రంలో బాధలు చెప్పుకునే వేదిక కల్పిస్తుండటంతో ప్రజా స్పందన బాగుంటోందని అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా పద్ రకాల సమస్యలరస తీర్చాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. రెవెన్యూ సంబంధిత సమస్యలు, ఇళ్ల పట్టాల మంజూరు, పట్టాదారు పాసుపుస్తకాలు తదితర వాటికి అత్యధిక అర్జీలు అందినట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కలెక్టర్ అక్కడే స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. బాధితుల గోడును కలెక్టర్ ఓపిగ్గా వింటున్నారు. అంతే ఓపిగ్గా అర్జీలు స్వీకరిస్తూ వాటికి పరిష్కారం చూపుతున్నారు. దీంతో అర్జీదారులు ఎంతో సంతృప్తి చెందుతున్నారు. కలెక్టరేట్‌కు వెళ్లాలంటే వ్యయ, ప్రయాసలతో కూడుకున్న పని. తమ వద్దకే అధికారులు రావడం ఎంతో సౌకర్యవంతంగా ఉందని ప్రజలు అంటున్నారు.

**జిల్లా వ్యాప్తంగా 457 అర్జీలు:**
జిల్లాలో ఇప్పటి వరకు వివిధ సమస్యలపై 457 అర్జీలు స్వీకరించారు. ఇందులో ఇప్పటికే 270 అర్జీలకు అధికారులు పరిష్కారం చూపారు. మిగిలిన 187 సమస్యలు తీర్చే దిశగా ప్రణాళికలు రూపొందించారు. అధికారులు వీటిపై కసరత్తు చేస్తున్నారు. త్వరితగతిన పూర్తి చేసేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నారు.

**టీడీపీ హయంలో నామమాత్రం**
ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమాన్ని ప్రభుత్వం ఎప్పటికప్పుడు మార్పులు చేస్తూ వస్తోంది. మరింత అందుబాటులోకి తెచ్చేలా సంస్కరణలు చేపడుతోంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో 'గ్రీవెన్స్' పేరుతో వివిధ సమస్యలపై అర్జీలు తీసుకునేవారు. కానీ పరిష్కారం నామమాత్రంగానే ఉండేది. సమస్యలపై వచ్చిన వారే మళ్లీ మళ్లీ కలెక్టర్ కార్యాలయానికి కాళ్లరిగేలా తిరిగే వారు. ఇలా కార్యక్రమ ప్రహసనంగా మారింది. ఒక్క సమస్య కూడా పరిష్కారమైన దాఖలాలు లేదు. ప్రజలకు వ్యయ ప్రయాసల తప్పేవి కాదు. తిరిగి వేసారిపోయిన బాధితులు గ్రీవెన్స్‌కు వచ్చేందుకు సాహసం చేసేవారు కాదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక 'గ్రీవెన్స్'ను స్పందన పేరుతో కొత్త ఒరవడి తీసుకువచ్చింది. ప్రజలకు అందుబాటులో ఉండేలా కలెక్టరేట్, ఆర్డీఓ, ఎంపీడీఓ, గ్రామ సచివాలయాల్లో ఫిర్యాదుల స్వీకరణ ప్రారంభించింది.

### ప్రజా సమస్యలకు ప్రాధాన్యం



'జగనన్నకు చెబుదాం' మండల కార్యక్రమంలో ప్రజా సమస్యల పరిష్కారానికి చాలా ప్రాధాన్యం ఇస్తున్నాం. దీర్ఘకాలికంగా పడుతున్న ఇబ్బందులు తీరుస్తున్నాం. ప్రజలు అవస్థలు చెప్పుకునేందుకు కలెక్టరేట్‌కు వచ్చేందుకు అవస్థలు పడేవారు. ఇలాంటి వ్యయ, ప్రయాసలను తీర్చేందుకు మండల కేంద్రాలకు వెళుతున్నాం. వారంలో రెండు రోజులు తప్పకుండా, పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. జిల్లా అధికారులు అర్జీలు తీసుకుని పరిష్కరిస్తుండటంతో జల్లో మంచి స్పందన వస్తోంది. మిగిలిన మండలాల్లో కూడా నిర్వహిస్తాం.

– కె.మాధవీలత, జిల్లా కలెక్టర్

### ఒకేసారి పింఛను, రేషన్‌కార్డు



నాకు ఒంట్లో బాగుండటం లేదు. రేషన్‌కార్డు, పింఛను కోసం కలెక్టరేట్‌కు వెళ్లి అర్జీ ఇద్దామనుకుంటే ఆరోగ్యం సహకరించడం లేదు. చేసేది లేక ఏడాదిగా అలాగే ఉండిపోయా. గత నెల 8వ తేదీన గోపాలపురంలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం పెట్టారు. కలెక్టర్‌ను కలిసి అర్జీ ఇవ్వగానే వెంటనే పరిష్కారం చూపారు. పింఛను, రేషన్‌కార్డు మంజూరైంది. నాలాంటి వాళ్లకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతోంది.

–ముప్పన శ్రీనివాసరావు, గోపాలపురం

# గృహ నిర్మాణ పనుల వేగవంతం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్ చిత్రంలో జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేనుగోపాల్ రావు, కలెక్టర్ మాధవీలత తదితరులు

**ఎంపీ మార్గాని భరత్ రామ్**

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): పట్టణ ప్రాంతాల్లో గృహ నిర్మాణ పనులు వేగవంతమయ్యేలా లబ్ధిదారులకు అవగాహన కలిగించాలని ఎంపీ మార్గాని భరత్ రామ్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. వివిధ శాఖల అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపి మార్గాని భరత్ మాట్లాడుతూఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయని కాంట్రాక్టర్లపై కేసు నమోదు చేయాలన్నారు. ఎంపీ నిధులతో 15 రక్షిత మంచి నీటి పథకాలకు ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మిస్తారన్నారు. గెయిల్ సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ పనులు పూర్తిచేయకపోతే కాంట్రాక్టర్లపై లబ్ధిదారులే ఫిర్యాదు చేసేలా చూడాలని నగరపాలక సంస్థ కమిషనర్‌కు సూచించారు. జగనన్న ఆరోగ్య సురక్ష సద్వినియోగం చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యమంత్రి భరోసాతో దయానా శాంతికి రూ.17 కోట్ల ఖరీదు చేసే వైద్య చికిత్స చేయిస్తున్నామన్నారు. ఉచితంగా ఇంజెక్షన్ అందజేసేందుకు ఎయిమ్స్ సంసిద్ధత తెలిపిందన్నారు. త్వరలో చికిత్స చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారన్నారు. బంగారు కొండ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేస్తామన్నారు. జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్ రావు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలన్నారు. 14, 15వ ఆర్థిక సంఘం నిధులను సద్వినియోగం చేయాలని సూచించారు. ఎస్పీ జగదీష్, అసిస్టెంట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్, జెడ్పీ సీఈఓ రమణ రెడ్డి, రవికుమార్, ఇతర జిల్లా, దిశా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ధాన్యం కొనుగోలు

**సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఎండీ వీరపాండ్యన్**



మాట్లాడుతున్న వీరపాండ్యన్, చిత్రంలో కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్, చందన నాగేశ్వర్, ఆకుల వీర్రాజు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: ఈ ఖరీఫ్ సీజనులో పకడ్బందీగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపడుతున్నట్లు ఏపీ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఎండీ వీరపాండ్యన్ తెలిపారు. పైలట్ ప్రాజెక్టుగా గుర్తించిన తొర్రేడు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. కొనుగోలు కేంద్రం నుంచి మిల్లుకు చేరే వరకు వాహనాన్ని కచ్చితంగా ట్రాకింగ్ చేస్తామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులూ లేకుండా చూడాలనేది ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశమన్నారు. అందులో భాగంగానే రైతుల సమస్యలు తెలుసుకుంటున్నామన్నారు. ఏ సమస్య వచ్చినా అధికారులకు తెలియజేయాలన్నారు. ఇక్కడి కేంద్రంలో తేమ శాతం, తూకం యంత్రాలను, డేటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలించారు. సిబ్బందికి సూచనలు చేశారు.

**ఫిర్యాదుల కోసం కంట్రోలు రూంలు**
జిల్లా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ గత రబీ, ఖరీఫ్ సీజన్లలో ఎదురైన సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఈసారి ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. కొనుగోలు కేంద్రం వద్ద ఫిర్యాదులు చేసేందుకు జిల్లా, డివిజన్, మండల స్థాయి కంట్రోల్ రూం ఫోన్ నంబర్లను అందుబాటులో ఉంచామన్నారు. గత ఏడాది కంటే 10 రోజుల ముందుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. తగినన్ని గన్ని బ్యాగులను అందజేయనున్నట్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ మాట్లాడుతూ కేంద్రాల్లో సాంకేతిక సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించి శిక్షణ ఇచ్చామన్నారు. కొందరు రైతులు తేమ శాతం, గన్ని బ్యాగులు, తూకం, తదితర అంశాలను దృష్టికి తీసుకుని వచ్చారు. ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, ఆర్డీవో ఎ.చైత్రవర్షిణి, జిల్లా పౌర సరఫరాల అధికారి విజయభాస్కర్, సివిల్ సప్లయిస్ డీఎం కుమార్, ట్రైనీ డీవోలు ఎం.భానుప్రకాష్,సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

**అధికారులతో సమీక్ష**
సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ – ముందస్తు కార్యాచరణ ప్రణాళికపై మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్‌తో కలసి రాష్ట్ర పౌరసరఫరాల వీసీ, ఎండీ జి.వీరపాండ్యన్ సమీక్షించారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ జిల్లాలో 231 కొనుగోలు కేంద్రాల ద్వారా 4.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. జేసీ తేజ్ భరత్ మాట్లాడారు.

# నిధులు దండిగా... పల్లెలు సందడిగా..

సాక్షి ప్రతినిధి, కాకినాడ: అవన్నీ మారుమూల పల్లెటూళ్లు. అక్కడ రెండు మూడడుగులు కూడా లేని పుంత రోడ్లు, లింకు రోడ్లు. పంట కాలువల వెంబడి ఆ రోడ్లు దిగబడిపోయి అడుగు వేయడానికి కూడా వీలుండేవి కావు. చినుకు పడిందంటే నరకప్రాయమే. మోకాలి లోతు బురదలో ప్రయాణించాల్సిందే. గ్రామాల మధ్య లింకు రోడ్ల పరిస్థితి మరీ అధ్వానం. గత పాలకుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలిచిన ఇలాంటి రహదారులు కోకొల్లలు. ఒకటీ రెండూ కాదు ప్రతి నియోజకవర్గంలో పదుల సంఖ్యలో నిరాదరణకు గురయ్యాయి. నాటి చంద్రబాబు సర్కార్ వీటిని గాలికొదిలేసింది. పైగా తమ తప్పును కప్పిపుచ్చుతూ ఇందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదే బాధ్యత అన్నట్టుగా టీడీపీ సహా విపక్షాలు బురదజల్లుతున్నాయి.

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జెడ్పీ నిధులతోజరుగుతోన్న పనులు**

| | |
|---|---|
| సీసీ రోడ్లు | 247 |
| కమ్యూనిటీ హాల్స్ | 122 |
| గ్రావెల్ రోడ్లు | 184 |
| సీసీ డ్రైన్స్ | 69 |
| అంగన్‌వాడీ సెంటర్స్ | 22 |
| బోర్‌వెల్స్ | 30 |
| రిటైలింగ్ కాంపౌండ్‌వాల్స్ | 24 |
| బిటి రోడ్లు | 8 |
| ఇతర పనులు | 50 |
| మొత్తం | 756 |



పి.గన్నవరం ముంగండపాలెంలో అద్దంలా మెరిసిపోతోన్న రోడ్డు

- ఉమ్మడి తూర్పులో ప్రగతి పరుగులు
- అద్దంలా మారుతున్న రహదారులు
- దీర్ఘకాల సమస్యలకు పరిష్కారం
- శరవేగంగా డ్రైన్లు, కమ్యునిటీహాళ్ల నిర్మాణం
- రూ.20 కోట్లతో చురుగ్గా756 పనులు

**జెడ్పీ సారథ్యంలో ప్రగతి దారులు**
ప్రస్తుతం పల్లెల్లో పరిస్థితులు మారుతున్నాయి. గత సర్కారు నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారిన రోడ్లు, డ్రైన్లను ఆధునీకరిస్తూ ప్రతిపక్షాల విమర్శలపే తిప్పికొట్టేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంకల్పించింది. పల్లెలకు మంచి చేసే ఈ సత్కార్యానికి జిల్లా పరిషత్ చేదోడుగా నిలిచింది. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ సభ్యులు, మండల పరిషత్ అధ్యక్షుల సిఫారసులకు అనుగుణంగా జిల్లా పరిషత్ సుసంకల్పంతో అడుగులేస్తోంది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపుతోంది. ఫలితంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని వందలాది పల్లెల్లో ప్రగతికి బాటలు పడుతున్నాయి. చిన్న చిన్న పుంత రోడ్లు అద్దాల్లా మెరిసిపోతున్నాయి.

**నియోజకవర్గాల వారీగా జరుగుతోన్న పనులు**

| నియోజకవర్గం | పనులు |
|---|---|
| అనపర్తి | 51 |
| జగ్గంపేట | 29 |
| రాజమహేంద్రవరం సిటీ | 04 |
| రాజమహేంద్రవరం రూరల్ | 08 |
| రాజానగరం | 23 |

**చురుగ్గా పనులు**
ఈ ఆర్థిక సంవత్సరంలో జెడ్పీ సాధారణ నిధుల నుంచి రూ.20 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో గత ఏప్రిల్‌లో సుమారు 756 పనులకు శ్రీకారం చుట్టారు. అవన్నీ చురుగ్గా జరుగుతున్నాయి. జనరల్ ఫండ్ కేటాయింపులతో రోడ్లు, డ్రైన్లు, శిథిలమైన కమ్యూనిటీ హాళ్లు, అంగన్‌వాడీ, ఎస్సీ, బీసీ వసతి గృహాల పనులు 60 శాతం చివరి దశకు చేరుకున్నాయి. మిగిలినవి వచ్చే నెలాఖరుకు పూర్తి చేయాలనే సంకల్పంతో ఉన్నారు. ప్రతి పనికి జెడ్పీ నుంచి రూ.5 లక్షలకు తక్కువ కాకుండా కేటాయించారు. గ్రామ స్థాయిలో వర్క్స్ కమిటీల పర్యవేక్షణలో స్థానికులు తమ ఊళ్లు బాగుపడాలనే సంకల్పంతో దగ్గరుండి మరీ పనులు పారదర్శకంగా చేసుకుంటున్నారు.

### అన్ని నియోజకవర్గాలకూ నిధులు



గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.2 కోట్లు అదనంగా కేటాయించాం. గ్రామాల్లో ఎక్కువ మందికి ప్రయోజనం కల్పించే పనుల కోసం పరిపాలనామోదం ఇచ్చాం. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రజాప్రతినిధుల సిఫార్సులను ఆమోదించి దాదాపు అన్ని నియోజకవర్గాలకు నిధుల మంజూరు చేశాం. ప్రారంభంలో వర్షాల కారణంగా పనులు కొంత మందకొడిగా సాగాయి. ఇప్పుడు చురుగ్గా జరుగుతున్నాయి. గ్రామ స్థాయి కమిటీల ఆధ్వర్యంలోనే పనులు పక్కాగా జరుగుతున్నాయి.

– విప్పర్తి వేణుగోపాలరావు జెడ్పీ చైర్‌పర్సన్

## క్లుప్తంగా

### రంజీ టీ-20 జట్టు ఫీల్డింగ్ కోచ్‌గా శ్రీనివాస్



అంబాజీపేట: ఆంధ్రప్రదేశ్ రంజీ టీ-20 జట్టు ఫీల్డింగ్ కోచ్‌గా అంబాజీపేటకు చెందిన నిమ్మకాయల శ్రీనివాస్ ఎంపికయ్యారు. జార్ఖండ్‌లోని రాంచీలో వచ్చే నెలలో జరగనున్న రంజీ టీ-20 పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టుకు శ్రీనివాస్ ఫీల్డింగ్ శిక్షణ ఇవ్వనున్నారు. గత ఏడాది కూడా శ్రీనివాస రంజీ టీ-20 జట్టుకు ఫీల్డింగ్ కోచ్‌గా ఎంపికయ్యారు. అంబాజీపేటకు చెందినది శ్రీనివాస్ మంగళగిరిలోని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ రీజినల్ కోచింగ్ క్యాంప్‌లో కోచ్‌గా సేవలందిస్తున్నారు. శ్రీనివాస్‌ను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు శరత్‌చంద్ర, కార్యదర్శి గోపీనాథ్ రెడ్డి, సీఈఓ శివరెడ్డి, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

### తైవాన్ వర్సిటీతో 'నన్నయ' ఒప్పందం



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న 'నన్నయ' వీసీ ఆచార్య పద్మరాజు, తైవాన్ వర్సిటీ ప్రతినిధి నవీన్ తదితరులు

రాజానగరం: తైవాన్ దేశానికి చెందిన నేషనల్ ఫార్మోసా యూనివర్సిటీతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం చేసుకుంది. ఇందుకు సంబంధించిన పత్రాలపై ఉభయ వర్సిటీల ప్రతినిధులు సంతకాలు చేసి, పరస్పరం మార్చుకున్నారు. ఈ సందర్భంగా వర్సిటీ పాలక మండలి హాలులో మంగళవారం జరిగిన సమావేశంలో 'నన్నయ' ఉప కులపతి ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ, విద్యార్థులు, అధ్యాపకులకు, పరిశోధకులకు అవసరమైన సమకాలీన అంశాలు, ఫ్యాకల్టీ నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కోసం విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు ఈ ఒడంబడిక ఉపయోగపడుతుందని వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, తైవాన్ యూనివర్సిటీ ప్రతినిధి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటనకు సర్వం సిద్ధం

- రేపు సామర్లకోట రానున్న ముఖ్యమంత్రి జగన్
- జగనన్న కాలనీ ప్రారంభం
- రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షలకు పైగా ఇళ్లకు ఇక్కడి నుంచే ప్రారంభోత్సవం
- సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



సామర్లకోట జగనన్న కాలనీలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, కలెక్టర్ కృతికా శుక్లా తదితరులు



సీఎం సభా వేదికపై అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్

సామర్లకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గురువారం సామర్లకోట రానున్న నేపథ్యంలో ఆయన పర్యటనకు ఏర్పాట్లు పూర్తి చేశామని కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. సీఎం పర్యటన ఏర్పాట్లను ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, జిల్లా స్థాయి అధికారులతో కలిసి కలెక్టర్ మంగళవారం పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జగనన్న కాలనీలో ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రైన్లు, లైటింగ్, ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించామని చెప్పారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనకు వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ఏర్పాట్లు చేశామని చెప్పారు. ముఖ్యంగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలకు ప్రత్యేకంగా పార్కింగ్ సదుపాయం కల్పించామన్నారు. ముఖ్యమంత్రి పర్యటించే మార్గం మినహా మిగిలినచోట్ల ఎటువంటి ఆంక్షలూ ఉండవని చెప్పారు. సీఎం పర్యటనకు అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా పెద్దాపురం నియోజకవర్గానికి వస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అపూర్వ స్వాగతం పలకడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తి కావడంతో.. వీటన్నింటినీ సామర్లకోట జగనన్న కాలనీ నుంచి సీఎం జగన్ ప్రారంభించనుండటం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. హైదరాబాద్‌లోని లేఅవుట్లలో కూడా లేని విధంగా సామర్లకోట జగనన్న కాలనీలో ఏడు పార్కులను అత్యంత సుందరంగా తీర్చి దిద్దామని తెలిపారు. జగనన్న కాలనీలో రూ.15 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలకు రూ.32 వేల కోట్లు కేటాయించారన్నారు. కలెక్టర్ కృతికా శుక్లా కృషితోనే మౌలిక సదుపాయాల కల్పన వేగంగా జరిగిందని చెప్పారు. ఈ కాలనీలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలు కూడా ఏర్పాటు చేశారని దొరబాబు తెలిపారు.

### అధికారులకు బాధ్యతల అప్పగింత

ముఖ్యమంత్రి పర్యటనకు సామర్లకోట – పెద్దాపురం రోడ్డులో ఏర్పాటు చేసిన హెలిపాడ్, జగనన్న కాలనీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని సీఎం సభా వేదికను ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి వివిధ బాధ్యతలను ఆయా శాఖల అధికారులకు కలెక్టర్ కృతికా శుక్లా అప్పగించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా, ఏఎస్పీ పి.శ్రీనివాసరావు, జెడ్పీ సీఈఓ అబ్బిరెడ్డి రమణారెడ్డి, ఆర్డీఓలు ఎన్‌వీవీ సత్యనారాయణ, జె.సీతారామారావు, డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి నరసింహనాయక్, పాఠశాల విద్యా శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ నాగమణి, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, ఏఓ ఎం.ఏసుబాబు, మున్సిపల్ కమిషనర్లు జె.రామారావు, గంపా సురేంద్ర, తహసీల్దార్లు ఎస్‌ఎల్‌వీ కుమారి, వజ్రపు జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# పూటుగా తాగి.. చాకుతో పొడిచాడు

- అన్నదమ్ములపై యువకుడి ఘాతుకం
- ఆసుపత్రికి తరలిస్తుండగా అన్న మృతి
- తమ్ముడికి తీవ్ర గాయాలు
- బొమ్మూరు జేఎల్‌బీ నగర్‌లో ఘటన



సిరికి నరేష్ బాబు(ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: ఒక యువకుడు మద్యం మత్తులో అన్నదమ్ములను బటన్ చాకుతో పొడిచాడు. ఈ సంఘటనలో అన్న మృతి చెందగా, తమ్ముడు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నాడు. బొమ్మూరు జేఎల్‌బీ నగర్‌లో ఈ దారుణం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. జేఎల్‌బీ నగర్‌కు చెందిన ఇసిరి నరేష్‌బాబు ఎలియాస్ పెద్ద (27), ఇసిరి సురేష్ ఎలియాస్ చిన్న అన్నదమ్ములు. నరేష్‌బాబు ఒంగోలులోని ఇసుక ర్యాంపులో సూపర్‌వైజర్‌గా పని చేస్తూ వర్షాల కారణంగా ఇటీవలే స్వగ్రామం వచ్చాడు. సురేష్ కేబుల్ పనులు చేస్తూంటాడు. అదే ప్రాంతానికి చెందిన రంకిరెడ్డి ప్రేమ్‌కుమార్ అనే యువకుడు రెండు రోజుల క్రితం 30 మందితో తన పుట్టిన రోజు వేడుకలు ఆర్భాటంగా నిర్వహించాడు. ఈ వేడుకల్లో మద్యం తాగిన ప్రేమ్‌కుమార్ అదే రోజు రాత్రి 11 గంటల సమయంలో ఇంటికి వెళ్తున్న నరేష్‌బాబుతో గొడవ పడ్డాడు. అతడు పట్టించుకోకుండా వెళ్లిపోతున్నప్పటికీ మళ్లీ గొడవ పడేందుకు ప్రయత్నించాడు. ఈలోగా నరేష్‌బాబు తల్లి సత్యవతి అక్కడకు వచ్చింది. ప్రేమ్‌కుమార్‌ను వారించి, నరేష్‌బాబును ఇంటికి తీసుకువెళ్లిపోయింది. ఆ మర్నాడు ప్రేమ్‌కుమార్ విషయాన్ని అతడి తల్లికి చెబుదామని అనుకున్నారు.

నరేష్‌బాబు, సురేష్ కలిసి మంగళవారం సాయంత్రం జేఎల్‌బీ నగర్‌లోని సుద్దగనిలో కూర్చుని మద్యం తాగుతున్నారు. ఈలోగా పూటుగా తాగిన ప్రేమ్‌కుమార్ అక్కడకు చేరుకున్నాడు. తాను తెచ్చుకున్న బటన్ చాకుతో ఒక్కసారిగా నరేష్‌బాబు గుండెలపై పొడిచాడు. అలాగే సురేష్ ఛాతి, పొట్టపై పొడిచి, పరారయ్యాడు. నెత్తుటి మడుగులో పడి ఉన్న అన్నదమ్ములిద్దరినీ స్థానికులు గుర్తించి, రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మార్గం మధ్యలోనే నరేష్‌బాబు మృతి చెందాడు. సురేష్ కడుపులో తీవ్రంగా రక్తస్రావం కావడంతో నగరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ ఆర్.విజయ కుమార్ సందర్శించారు. స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రేమ్‌కుమార్‌కు అన్నదమ్ములకు మధ్య గొడవకు కారణాలపై ఆరా తీశారు. నిందితుడు ప్రేమ్‌కుమార్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

### జేఎల్‌బీ నగర్‌లో విషాద ఛాయలు

జేఎల్‌బీ నగర్‌కు చెందిన సిరికి దామోదరరెడ్డి, సత్యవతి దంపతులకు నరేష్‌బాబు, సురేష్ సంతానం. మూడు నెలల క్రితమే దామోదరరెడ్డి గుండెపోటుతో మృతి చెందాడు. అప్పటి నుంచీ సత్యవతి తన ఇద్దరు పిల్లలను, కోడలు, మనవడిని చూసుకుంటూ జీవిస్తోంది. ఒంగోలులో పని చేసుకుంటూ ఇంటికి వచ్చిన నరేష్‌బాబు ప్రేమ్‌కుమార్ చేతిలో హతమైన విషయాన్ని జేఎల్‌బీ నగర్ వాసులు జీర్ణించుకోలేకపోతున్నారు. భర్త చనిపోయి మూడు నెలలు కూడా కాలేదు, ఇప్పుడు పెద్ద కొడుకు మృత్యువాత పడ్డాడని చెప్తే సత్యవతి గుండె తట్టుకోలేదని భావిస్తూ, ఇద్దరు కుమారులూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని ఆమెను నమ్మిస్తున్నారు. ఎప్పుడూ ఎవరి జోలికీ వెళ్లకుండా పని చేసుకుంటున్న అన్నదమ్ములపై ఎలా దాడి చేయాలనిపించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నరేష్‌బాబుకు వివాహం జరిగి భార్య, ఏడాదిన్నర కుమారుడు ఉన్నారు. భార్య ప్రస్తుతం పుట్టింట్లో ఉందని, ఆమెను ఎలా ఓదార్చాలోనంటూ తల్లడిల్లుతున్నారు.

# పక్కా నిఘా.. పట్టించిందిగా..

- ముగ్గురు దొంగల అరెస్టు
- 18 బైకులు స్వాధీనం
- విలువ రూ.10 లక్షలు



స్వాధీనం చేసుకున్న బైకులను, నిందితులను చూపుతున్న డీఎస్పీ విజయపాల్, పోలీసు సిబ్బంది

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పాత నేరస్తుల కదలికలపై పోలీసులు ఎప్పటికప్పుడు ఓ కన్ను వేసి ఉంచితే.. రౌడీషీటర్లు, ఇతర నేరగాళ్లపై పటిష్టమైన నిఘా పెడితే.. నేరాలకు చాలా వరకూ అడ్డుకట్ట పడక తప్పదు. ఇదే తరహాలో పోలీసులు బైక్ దొంగలను పట్టుకున్నారు రాజమహేంద్రవరం ప్రకాశం నగర్ పోలీసులు. ప్రకాశం నగర్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.విజయపాల్ ఈ వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. జిల్లాలో కొంత కాలం నుంచి జరుగుతున్న ద్విచక్ర వాహనాల చోరీలపై ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు డీఎస్పీ కె.విజయపాల్ పర్యవేక్షణలో ప్రకాశం నగర్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తమ సిబ్బందితో నిఘా బృందం ఏర్పాటు చేశారు. నేరగాళ్లపై అవగాహన ఉన్న ఈ సిబ్బంది స్టేషన్ పరిధిలోని ఒక ప్రాంతంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు పాత నేరస్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. వారిలో ఒకరైన అనపర్తి మండలం పెడపర్తి గ్రామానికి చెందిన వీధి శేఖర్ గతంలో రెండు చోరీ కేసుల్లో అరెస్టయ్యి, జైలు శిక్ష అనుభవించి వచ్చినట్టు గుర్తించారు. అతడి స్నేహితుడైన మరో యువకుడు సంగాడ శివ బిక్కవోలు మండలం పందలపాకకు చెందినవాడు. అతడు రాజమహేంద్రవరం మోరంపూడిలో నివసిస్తూ పెయింటింగ్ పనులు చేస్తూండేవాడు. వీరిని మరింత లోతుగా విచారించగా జైలు నుంచి విడుదలయిన అనంతరం వీధి శేఖర్ రాజమహేంద్రవరం చేరుకుని, సంగాడ శివ సహకారంతో డబ్బులు సులువుగా సంపాదించేందుకు ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తున్నారని గుర్తించారు.

**చోరీలు ఇలా..**

షాపింగ్ మాల్స్ బయట, వివిధ ప్రాంతాల్లో వీరు రెక్కీ నిర్వహించేవారు. ఆయా ప్రాంతాల్లో అప్పుడే పార్కింగ్ చేస్తున్న వాహనాలను ఎంచుకునే వారు. వాహన యజమాని బైకు తాళం వేసి దూరంగా వెళ్లిన తరువాత ఆ బైకును మారు తాళం లాంటి పరికరంతో తీసి, క్షణాల్లో చోరీ చేసేవారు. ఇలా దొంగిలించిన ద్విచక్ర వాహనాలను జగ్గంపేట మండలం గోవిందపురానికి చెందిన స్నేహితుడు ఆకుమర్తి సూరిబాబు ద్వారా విక్రయించేవారు. ఈ విధంగా వారు ఇటీవలి కాలంలో 18 బైకులు దొంగిలించినట్టు పోలీసుల విచారణలో నిర్ధారణ అయ్యింది. ఆకుమర్తి సూరిబాబుపై కూడా గతంలో రెండు చోరీ కేసులు ఉన్నాయి. నిందితులు ముగ్గురినీ అరెస్టు చేసి, దొంగిలించిన మొత్తం 18 బైకులనూ స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.10 లక్షలు పైగా ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితులను చాకచక్యంగా పట్టుకుని, వారి నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్న ప్రకాశం నగర్ ఎస్సైలు పి.ప్రేమ్‌రాజు, బి.హరిబాబు, కానిస్టేబుళ్లు వి.నాగరాజు, పి.పోసిరాజు, సీహెచ్ శేషు, ఎస్.గణేశ్వరరావులను ఎస్పీ జగదీష్ అభినందించారు.

**బైక్ దొంగల అరెస్టు**

నిడదవోలు: ఇద్దరు బైక్ దొంగలను నిడదవోలు పట్టణ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఎస్సై పి.నాగరాజు కథనం ప్రకారం.. తన బైక్ పోయిందంటూ బెండపూడి గ్రామానికి చెందిన గోపిచిట్టి తేజ రామకృష్ణ ఈ నెల 9న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో తణుకు మండలం సజ్జాపురం గ్రామానికి చెందిన లకోక్కల నవీప్రేమ్, సిద్ధాంతం గ్రామానికి చెందిన కుడుపూడి వసంత శేఖర్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.80 వేల విలువైన రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం, తణుకు, పెనుగొండ, ఇరగవరం పోలీస్ స్టేషన్లలో 30కి పైగా కేసులున్నాయని ఎస్సై నాగరాజు తెలిపారు.



# పసికందును అమ్మేసిన ప్రియుడు

- రూ.3.20 లక్షలకు బేరం
- బాలింతకు బెదిరింపులు, ప్రలోభాలు
- ఐదుగురి అరెస్టు

అమలాపురం టౌన్: తన ప్రేయసి అయిన బాలింతను బెదిరించి, ప్రలోభపెట్టి పది రోజుల పసికందును అపహరించి, అమ్మేశాడో ప్రియుడు. అమలాపురం పట్టణం గొల్లగూడెంలో ఈ నెల నాలుగో తేదీన జరిగిన ఈ ఘటనపై పోలీసులు లోతైన దర్యాప్తు చేసి, ప్రియుడితో పాటు ఇందుకు సహకరించిన వారిని, పసికందును కొన్నవారిని అరెస్టు చేశారు. అమలాపురం డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ మంగళవారం రాత్రి ఈ వివరాలు వెల్లడించారు. గొల్లగూడేనికి చెందిన పసుపులేటి వరలక్ష్మి(34)కి గతంలో వివాహమైంది. భర్త వదిలేయడంతో విడిగా ఉంటోంది. ఆమె అమలాపురంలోని ఓ ప్రైవేటు బ్యాంకులో స్వీపరుగా పని చేస్తోంది. పట్టణానికి చెందిన వంట మేస్త్రి కొత్తపల్లి రాము, వరలక్ష్మి మూడేళ్లుగా సహజీవనం చేస్తున్నారు. రాము వల్ల గర్భవతి అయిన వరలక్ష్మి గత నెల 25వ తేదీన ఆడపిల్లకు జన్మనిచ్చింది. ఈ నేపథ్యంలో రాముకు కొంత మంది డబ్బు ఆశ చూపడంతో ఆ పసికందును అమ్మేయడానికి సిద్ధమయ్యాడు. ఈ నేపథ్యంలో తల్లి వరలక్ష్మిని బెదిరించి, ప్రలోభపెట్టి ఈ నెల నాలుగో తేదీన ఆ పసికందును కాకినాడ తీసుకుని వెళ్లి వేరే వారికి అమ్మేశాడు. వారు తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం మండలానికి చెందిన పిల్లలు లేని ఒక జంటకు ఆ పసికందును రూ.3.20 లక్షలకు అమ్మేశారు. ఈ సొమ్ములో తల్లి వరలక్ష్మికి రూ.1.40 లక్షలు మాత్రమే ఇచ్చారు. ఆ డబ్బుల్లో ప్రియుడు రాము రూ.20 వేలు వాడేసుకున్నాడు. దీనిపై వరలక్ష్మి గత ఆదివారం అమలాపురం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సీఐ టి.క్రాంతికుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేశారు. ఘటన తీవ్రత దృష్ట్యా జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ ఆదేశాల మేరకు డీఎస్పీ అంబికా ప్రసాద్ పర్యవేక్షణలో దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ కేసులో మొత్తం ఆరుగురు నిందితులను గుర్తించారు. వీరిలో ఐదుగురిని అరెస్టు చేశారు. అమలాపురానికి చెందిన కొత్తపల్లి రాము, విత్తనాల వారి కాల్వ గట్టుకు చెందిన పెయ్యల బాలరాజు, కాకినాడ విఘ్నేశ్వర నగర్‌కు చెందిన మర్రి స్వర్ణ ప్రకాష్, బిక్కవోలు మండలం పందలపాకకు చెందిన గుణ్ణం భానుకిరణ్, కాకినాడ రూరల్ మండలం తూరంగి గ్రామానికి చెందిన ఓదూరి సురేష్‌లను పోలీసులు అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచారు. నిందితులను రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించామని డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపారు. పసికందును తల్లి వరలక్ష్మికి పోలీసులు అప్పగించారు.

## టీడీపీ కార్యకర్త వీరంగం

### వైఎస్సార్ సీపీ కార్యకర్తపై బీరు సీసాతో దాడి



టీడీపీ కార్యకర్త దాడిలో గాయపడిన మహాలక్ష్మి

పిఠాపురం: ఓ టీడీపీ కార్యకర్త బీరు సీసాతో దాడి చేయడంతో వైఎస్సార్ సీపీ కార్యకర్త గాయపడ్డాడు. గొల్లప్రోలు ఎస్సై వినయ్ ప్రతాప్ కథనం ప్రకారం .. గొల్లప్రోలు మండలం చెందుర్తికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త తంగెళ్ల మహాలక్ష్మి స్థానిక దుకాణం వద్ద పేపర్ చదువుకుంటున్నాడు. అక్కడకు వచ్చిన అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కండిపల్లి సత్తిబాబు.. అకారణంగా మహాలక్ష్మితో తగాదాకు దిగాడు. తన వెంట తెచ్చుకున్న బీరు సీసాతో అతడిపై దాడి చేశాడు. ఈ దాడిలో గాయపడిన మహాలక్ష్మిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## గంజాయితో నలుగురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శేఖర్‌బాబు

ఏలేశ్వరం: గంజాయితో నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. సీఐ శేఖర్ బాబు మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. ఏలేశ్వరం పట్టణానికి చెందిన నలుగురు యువకులు అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సమీప గ్రామాల్లో గంజాయి కొనుగోలు చేసి, దానిలో కొంత కాల్చుకుని, మిగిలినది అమ్ముతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. వారు స్థానిక ఏలేరు జలాశయం సమీపంలోని ప్రాజెక్టుకు చెందిన పాడుబడిన భవనంలో ఉన్నట్టు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. పట్టణంలోని షిర్డి నగర్‌కు చెందిన గుండ్రోజు వీర వెంకట సత్య శ్రీనివాస్, మక్కారావు కాలనీకి చెందిన జొన్నాడ రాజేష్, వినోద్ మిత్రా నగర్‌కు చెందిన పచ్చిమళ్ల వీరబాబు, లింగంపర్తి గ్రామం సత్రం పంపు కాలనీకి చెందిన పడాల గన్నిరాజులను అరెస్టు చేశారు. వారి నుంచి 24 కేజీల గంజాయి, రెండు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను ప్రత్తిపాడు కోర్టులో హాజరుపరుస్తామని సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై జి.సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

### అన్నవరం దేవస్థానం పూర్తిస్థాయి ఈఓగా ఆజాద్



అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానానికి పూర్తి స్థాయి కార్యనిర్వహణాధికారి(ఈఓ)గా ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్‌ను నియమిస్తూ దేవదాయ, ధర్మదాయ శాఖ ముఖ్య కార్యదర్శి ఆర్.కరికాల్ వలవన్ మంగళవారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో ఎస్టేట్ ఆఫీసర్‌గా పని చేస్తున్న ఆజాద్‌ను గత మార్చి నెల నుంచి అన్నవరం దేవస్థానం తాత్కాలిక ఈఓగా ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం రెగ్యులర్ ఈఓగా నియమించారు.

## వ్యక్తి అనుమానాస్పద మృతి



కర్రి వెంకటరెడ్డి (పాత చిత్రం)

రాయవరం: మండలంలోని పసలపూడిలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. రాయవరం ఎస్సై జి.నరేష్ కథనం ప్రకారం.. మండపేట – కాకినాడ ప్రధాన రహదారిని ఆనుకుని పసలపూడి వై.జంక్షన్ వద్ద ఆర్కే హోటల్ సమీపాన వాసంశెట్టి వీర వెంకట సత్యనారాయణ పాన్ షాపు నిర్వహిస్తున్నాడు. సెల్ ఫోన్ తాకట్టు పెట్టే విషయంలో సత్యనారాయణకు, అదే గ్రామానికి చెందిన కర్రి వెంకటరెడ్డి(33)కి మధ్య సోమవారం రాత్రి జరిగిన వాగ్వాదం ఘర్షణకు దారి తీసింది. ఈ క్రమంలో సత్యనారాయణ గుండెలపై వెంకటరెడ్డి తన్నాడు. దీంతో గుండె నొప్పి వస్తోందంటూ ఇబ్బంది పడుతున్న సత్యనారాయణను అతడి సోదరుడు, స్నేహితుడు రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అర్ధరాత్రి 12 గంటల తర్వాత తన వల్లే సత్యనారాయణ ఆసుపత్రి పాలయ్యాడని, పలకరించి వద్దామని స్నేహితుడు మణికంఠను వెంట పెట్టుకుని వెంకటరెడ్డి రామచంద్రపురం ఆసుపత్రికి వెళ్లాడు. సత్యనారాయణను పరామర్శించిన అనంతరం వెంకటరెడ్డి ఆస్పత్రి వద్ద పిట్టగోడపై పడుకున్నాడు. కొద్దిసేపటికే పెద్ద శబ్దం రావడంతో ఆస్పత్రి వద్దనే ఉన్న సత్యనారాయణ, వెంకటరెడ్డి స్నేహితులు అక్కడకు చేరుకున్నారు. తలకు బలమైన నెత్తుటి గాయంతో వెంకటరెడ్డి నేలపై పడి ఉన్నాడని గమనించి, వెంటనే ఆసుపత్రికి తరలించగా, అప్పటికే వెంకటరెడ్డి మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడు వెంకటరెడ్డికి భార్య లక్ష్మీదేవి, కుమార్తె జాహ్నవీదేవి, కుమారుడు విశాల్ ఉన్నారు. లక్ష్మీదేవి గ్రామ వలంటీర్‌గా పని చేస్తున్నారు. ఆమె ఫిర్యాదు మేరకు మంగళవారం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నరేష్ తెలిపారు.

### ఏలేరు కాలువలో యువకుడి మృతి



రవితేజ మృతదేహం

రౌతులపూడి: ఏలేరు కాలువలో పడి శంఖవరం మండలం కత్తిపూడికి చెందిన అన్నిక దుర్గా రవితేజ (21) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. దుర్గా రవితేజ, అతడి స్నేహితులు కలిసి మంగళవారం ఉదయం పని నిమిత్తం రౌతులపూడి వచ్చారు. పని ముగించుకొని సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో స్నానం చేసేందుకు రౌతులపూడి శివారున ఏలేరు ఎడమ కాలువలో రవితేజ దిగి, గల్లంతయ్యాడు. అతడు కనిపించకపోవడంతో స్థానికులు గాలింపు చర్యలు చేపట్టారు. ఊబిలో చిక్కుకున్న రవితేజ కొద్దిసేపటికి శవమై తేలాడు. మృతుడికి తల్లి, చెల్లి ఉన్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు రౌతులపూడి ఎస్సై అబ్దుల్ నబీ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. రవితేజ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు.

## మతాబుల తయారీ కేంద్రంపై పోలీసుల దాడి

అంబాజీపేట: నివాస ప్రాంతాల మధ్య ఎటువంటి అనుమతులూ లేకుండా నిర్వహిస్తున్న మతాబుల తయారీ కేంద్రంపై పోలీసులు, రెవెన్యూ అధికారులు మంగళవారం దాడి చేశారు. వారి కథనం ప్రకారం.. అంబాజీపేట ఎస్ఆర్ఎంటీ ఎదురుగా ఉన్న వీధిలో అక్షింతల శ్రీధర్ తన ఇంట్లో మతాబులు తయారు చేస్తున్నాడు. ఇంట్లో సుమారు 4 టన్నుల మతాబుల మందు నిల్వ ఉంచినట్టు గుర్తించారు. దీని విలు సుమారు రూ.2 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. కనీస జాగ్రత్తలు కూడా పాటించకుండా శ్రీధర్ తన ఇంట్లో మతాబులు తయారు చేస్తున్నాడని సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్సై ఎ.చైతన్య కుమార్, ఇన్‌చార్జి తహసీల్దార్ పి.నాగపద్మలక్ష్మి తెలిపారు. అతడి నుంచి మతాబు మందుతో పాటు తయారు చేసిన మతాబులను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. దీపావళి పండగను పురస్కరించుకుని ఎవరైనా అనుమతులు లేకుండా బాణసంచా తయారు చేసినా, నిల్వ ఉంచినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని సీఐ ప్రశాంత్‌కుమార్ హెచ్చరించారు.

### పాము కాటుతో మహిళ మృతి



కనకదుర్గ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

మామిడికుదురు: ఆదుర్రు శివారు మోరిపాలానికి చెందిన మల్లాడి కనకదుర్గ (48) పాము కాటుకు గురై మృతి చెందింది. ఇంటి ఎదురుగా ఉన్న కొబ్బరి తోటలోకి వెళ్లిన ఆమెను సోమవారం సాయంత్రం పాము కాటు వేసింది. చికిత్స కోసం రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందిందని నగరం ఎస్సై పి.సురేష్ మంగళవారం తెలిపారు. మృతురాలి కుమారుడు మల్లాడి వీర వెంకట సత్యనారాయణ ఫిర్యాదు మేరకు దీనిపై కేసు నమోదు చేశామన్నారు. ఇదే మండలంలోని గెద్దాడ గ్రామంలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కనకదుర్గ ఒంటరి మహిళ పెన్షన్ అందుకుంటోంది. పెన్షన్ తీసుకునేందుకు మూడు రోజుల క్రితం ఇంటికి వచ్చిన ఆమె, పాము కాటుకు గురై మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.